క్లుప్తంగా

అవురువాడలో సీతారాముల విగ్రహ ప్రతిష్ట

మాడుగుల: మండలంలో అవురువాడ గ్రామంలో ఆదివారం సీతారాముల వారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం గ్రామస్తులు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి స్వామివారిని దర్శించుకున్నారు.

పుస్తక పఠనంతో సామాజిక స్పృహ



పుస్తక పఠనం కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

చీడికాడ : చీడికాడ శాఖా గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన తరగతుల్లో ఆదివారం విద్యార్థులతో కథలు చదివి వినిపించి పుస్తక పఠనంపై ఆసక్తి కలిగించారు. పుస్తకపఠనం వల్ల సమకాలిక అంశాలపై విద్యార్థులకు జ్ఞానం లభిస్తుందని గ్రంథాలయాధికారి ఎం.జోగేశ్వరి అన్నారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

వేసవి విజ్ఞాన శిబిరాలతో సృజనాత్మకత



చౌడువాడ శాఖా గ్రంథాలయంలో నీతికథలు చదివిస్తున్న గ్రంథాలయాధికారి పద్మావతి

కె.కోటపాడు : వేసవి సెలవుల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలతో వారిలో విజ్ఞానంతో పాటు సృజనాత్మక శక్తి మరింత మెరుగుపడుతుందని చౌడువాడ శాఖా గ్రంథాలయాధికారి పద్మావతి అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా ఆదివారం హాజరైన విద్యార్థులకు నీతికథలను బోధించడంతో పాటు ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థి దశ నుండే మంచి అలవాట్లు అలవర్చుకోవడంతో పాటు క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు సూచించారు.

మార్కెట్ కమిటీ చైర్మన్ అప్పలరాజుకు సన్మానం



మాడుగులలో అప్పలరాజును సన్మానిస్తున్న దృశ్యం

మాడుగుల రూరల్ : మాడుగుల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన పుప్పాల అప్పలరాజును పలువురు ఆదివారం సన్మానించారు. మండల జనసేన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంట్రెడ్డి శివాజీ, దాసరి అచ్యుతరావు సన్మానించారు. ఈ కార్యక్రమంలో పిళ్లా నాయుడు, పాము నాగరాజు, దామరౌతు అశోక్, కోన కొండలరావు, గుమ్మాల నానాజీ, బుదిరెడ్ల కన్నా, అభి, గంగాధర్, పడాల శ్రీను, బెజవాడ రాజేష్ పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల ఒడ్డు పండగలు



ఎం. కోడూరు మోదమాంబకు పూజలు చేస్తున్న భక్తులు

మాడుగుల రూరల్: పలు గ్రామాల్లో గ్రామ దేవతలకు భక్తులు ఆదివారం ఒడ్డు పండగలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఎం.కోడూరు మోదమాంబ ఆలయంలో భక్తుల గోత్ర నామాలతో పూజలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు, సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు ఆధ్వర్యంలో భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశారు. సాగరం, గాదిరాయి, ఎం.కోటపాడు, కె.జె.పురం, గ్రామాల్లో మోదమాంబ ఆలయాల వద్ద ఒడ్డు పండగలు నిర్వహించారు. కె.జె.పురం నూకాంబిక ఆలయం వద్ద పూజలు నిర్వహించారు.

‘గూడు’కట్టిన నిరాశ

టిడ్కో లబ్ధిదారుల ఎదురుచూపులు

కనీస సదుపాయాల కల్పనకు ప్రభుత్వం మీనమేషాలు



నిర్మాణం పూర్తయిన టిడ్కో గృహాలు

నర్సీపట్నం : నిరుపేదల సొంతింటి కల సాకారానికి ఎనిమిదేళ్లుగా ఎదురుచూపులే మిగిలాయి. 2018 టీడీపీ ప్రభుత్వంలో పేదలకు సొంత గూడు కల్పించేందుకు జీప్లస్ 3 విధానంలో నర్సీపట్నం మున్సిపాలిటీ బయపురెడ్డిపాలెం, బలిఘట్టం ఉత్తరవాహిని సమీపంలో టిడ్కో గృహాలను నిర్మించారు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం పనులను అసంపూర్తిగా వదిలేసి, ఎన్నికలకు ముందు హడావుడిగా ప్లాట్లు కేటాయించి చేతులు దులుపుకొంది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అసంపూర్తిగా వదిలేసిన పనులను పూర్తి చేసింది. మొత్తం 1820 ఇళ్ల కోసం 1420 ఇళ్ల పనులు పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా టిడ్కో గృహాల సముదాయంలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో పూర్తి గృహాలు సైతం నిరుపయోగంగా ఉన్నాయి. విద్యుత్, డ్రైనేజీ, రోడ్లు, వీధిలైట్లు, తాగునీటి సరఫరా వంటి సౌకర్యాలను కల్పించడంలో కూటమి ప్రభుత్వం మీనమేషాలు ఎక్కిస్తుంది. టిడ్కో గృహాల రుణ గ్రహీతలకు మాత్రం రుణాలు చెల్లించాలని బ్యాంకు అధికారులు నోటీసులు పంపుతుండడంతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఇటు ఇళ్లు దక్కక..అటు రుణ భారంతో లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కనీస సౌకర్యాలు కల్పించి గృహాలు అప్పగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ సురేంద్రను సంప్రదించగా జూన్ నాటికి మౌలిక సదుపాయాలు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు.

అమర వీరునికి నివాళిగా ర్యాలీ



జోగుంపేటలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న యువత

గొలుగొండ : భారతదేశం గొప్పది..ఇటువంటి దేశంలో పుట్టడం మన అదృష్టం. ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి ప్రతి ఒక్కరూ మద్దతు పలకాలి.. వీర మరణం పొందిన కుటుంబాలకు మద్దతుగా ఉండాలని తెలుపుతూ గొలుగొండ నుంచి జోగుంపేట వరకు యవత పెద్ద ఎత్తున ఆదివారం సాయంత్రం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్ వంటి శత్రుదేశాలు భారతవైపు కన్నెత్తి చూస్తే ప్రతి పౌరుడూ ఒక సైనికుడిగా ఉండాలని చూచించారు. యుద్ధంలో వీర మరణం పొందిన మురళీనాయక్ కుటుంబానికి అండగా ఉండాలని తెలిపారు. మాజీ సైనిక ఉద్యోగి పండా శ్రీనివాస్ మాట్లాడుతూ భారత్ జోలికి వస్తే పాకిస్తాన్‌కు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. యువత ప్రతి విషయంలో దేశానికి మద్దతుగా నిలవాలని అన్నారు.

జంపెనలో మోదకొండమ్మ ఆలయ వార్షికోత్సవం

మాడుగుల : మండలంలో జంపెన గ్రామంలో ఆదివారం మోదకొండమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్తుల ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన కార్యక్రమం జరిపారు. గ్రామస్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా తలుపులమ్మ ఒడ్డు పండగ



అమ్మవారికి పూజలను చేస్తున్న వైస్ ఎంపీపీ సూర్యనారాయణ, తదితరులు

కె.కోటపాడు : పాచిలవానిపాలెం గ్రామ దేవత తలుపులమ్మ అమ్మవారి ఒడ్డు పండగ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా జరిపారు. అమ్మవారికి మహిళలు పసుపు, కుంకుమ, చీరలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఒడ్డు పండగ పర్వదినంతో పెద్ద సంఖ్యలో అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించేందుకు భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి. వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, గండి సత్యం, సిరపరపు నాయుడుబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సుర్రుమన్న సూరీడు



ఎండలకు నిర్మానుష్యంగా ఉన్న చోడవరం మెయిన్‌రోడ్డు

చోడవరం : ఎండలు మళ్లీ సుర్రుమన్నాయి. ఈ వేసవిలో మొదట్లో ఎండలు మండిపోయినప్పటికీ మధ్యలో అకాల వర్షాల వల్ల కొన్ని రోజులు వాతావరణం చల్లబడింది. మరలా మూడ్రోజులుగా ఎండలు తీవ్రత బాగా పెరిగింది. శుక్ర, శని, ఆదివారాల్లో మరింత ఎండ మండిపోయింది. చోడవరం పట్టణంలో ఆదివారం 38 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 7 గంటల నుంచే సూరీడు సుర్రు...మనిపించాడు. ఇక మధ్యాహ్నం 11గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఎండ తీవ్ర జనాన్ని బెంబేలెత్తించింది. రాత్రి 7గంటలకు గాని వాతావరణం కాస్త చల్లబడకపోవడంతో పిల్లలు, వద్దులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఎండ ధాటికి తట్టుకోలేక నిత్యం రద్దీగా ఉండే పట్టణంలోని మెయిన్‌రోడ్డుతో పాటు వ్యాపార కూడళ్ల అన్నీ జనం, వ్యాపారం లేక నిర్మానుష్యంగా కనిపించాయి. మరో పక్క అప్రకటిత విద్యుత్ కోతలు జనాన్ని మరింత ఇబ్బందులకు గురిచేశాయి.

స్కీమ్ వర్కర్లకు కనీస వేతనం రూ.35 వేలు ఇవ్వాలి

అనకాపల్లి: స్కీమ్ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కనీస వేతనం నెలకు రూ.35 వేలు అందజేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. స్థానిక ఏఐటీయూ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయన్నారు. కార్మికులు అందరూ ఏకం కావలసిన సమయం ఆసన్నమైందన్నారు. దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సార్వత్రిక సమ్మెకు అన్ని వర్గాల ప్రజలు పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటించాలని కోరారు. కార్మిక హక్కులను కాలరాసే ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి సమ్మెను చేయడం జరుగుతుందన్నారు. భవన, ఆటో, ముఠా కార్మికులకు సమగ్రమైన సంక్షేమ బోర్డు తక్షణమే ఏర్పాటు చేయాలని, ఉపాధి హామీ కార్మికులకు 200 రోజులు పని దినాలు కల్పించి రోజుకు రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు వియ్యపు రాజు, డి. అనిల్ రాజు, బి.శ్రీను, నర్సింగరావు, అప్పలరాజు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమావేశమైన పూర్వ విద్యార్థులు

నర్సీపట్నం : వేములపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003-04లో పదో తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ ఆత్మీయ సమ్మేళనంలో 80 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. హైస్కూల్ చదువుల నాటి మధురానుభూతులను నెమరవేసుకున్నారు. పూర్వ విద్యార్థుల కలయికతో పండగ వాతావరణం నెలకొంది. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను స్మరించుకుని వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

వడ్డాది విద్యార్థులకు వేసవి క్రీడా శిబిరం



వడ్డాది హైస్కూల్లో వేసవి క్రీడా శిబిరం ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు



తైక్వాండో పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

బుచ్చెయ్యపేట: వడ్డాది కేవీడీ జిల్లా పరిషత్ హైస్కూల్లో విద్యార్థులకు వేసవి శిక్షణ శిబిరాన్ని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు ఆదివారం ప్రారంభించారు. స్థానిక అమ్మ హెల్పింగ్ హార్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ప్రారంభించిన జెడ్పీటీసీ రాంబాబు మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల 25వ తేదీ వరకు 15 రోజుల పాటు ఈ శిబిరం కొనసాగుతుందని, ప్రతి రోజు విద్యార్థులకు యోగా, తైక్వాండోతో పాటు పలు క్రీడల్లో శిక్షణ ఇస్తారన్నారు. ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేశం, టౌన్ పార్టీ అధ్యక్షుడు దొండా నరేష్, బీజేపీ కార్యదర్శి నానాజీ, కోచ్‌లు పుల్లేటి సతీష్, పీటర్ రాంబాబు, అమ్మ హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన



ఎల్‌బీపురం అగ్రహారం పాఠశాలలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

బుచ్చెయ్యపేట : మండలంలో ఎల్‌బీపీ అగ్రహారం ఎంపీపీ పాఠశాలలో స్థానిక యువకుల ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. విశాఖకు చెందిన మెడికవర్, పుష్పగిరి కంటి ఆస్పత్రి, వీఎస్ఆర్ సేవా సంస్థ వారి సౌజన్యంతో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, కంటి పరీక్షలు, సాధారణ వైద్య పరీక్షలు, కార్డియాలజీ, డెర్మటాలజీ, హెయిర్ అండ్ కాస్మోటాలజీ, ఆర్థోపెడిక్ తదితర పరీక్షలు నిర్వహించారు. సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి చికిత్సలకు 15 మందిని ఎంపిక చేశారు. ఈ శిబిరంలో గుండె వైద్య నిపుణుడు డాక్టర్ భాగ్యరాజ్, కంటి వైద్య నిపుణుడు ఎంఎస్ఎల్ రాజుతో పాటు జెడ్పీటీసీ సభ్యుడు దొండా రాంబాబు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, సర్పంచ్ మొల్లి శ్రీను, మాజీ ఎంపీటీసీ దొండా శ్రీను, ఎంపీటీసీ యల్లపు జగ్గారావు, దొండా నరేష్ పాల్గొన్నారు.

భయపెడుతున్న శిథిల కల్వర్టు



ఏలేరు కాలువపై ఎ.శరభవరం వద్ద నిర్మించిన కల్వర్టు

నాతవరం: నర్సీపట్నం తుని మధ్య అర్అండ్‌బీ రోడ్డులో ఎ.శరభవరం వద్ద ఏలేరు కాలువ కల్వర్టు శిథిలమై ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. ఏలేశ్వరం ప్రాజెక్టు నుంచి విశాఖపట్నంలో పరిశ్రమలకు ప్రజలు తాగునీటికి ఏలేరు కాలువ ద్వారా నీటిని తరలిస్తున్నారు. నాతవరం మండలంలో 25 కిలోమీటర్లు మేర ఏలేరు కాలువ ఉంది. ఎంబీపటం పంచాయతీ శివారు ఎ.శరభవరం గ్రామం వద్ద ఏలేరు కాలువకు ఆర్అండ్‌బీ రోడ్డుపై వాహనాలు రాకపోకలు సాగించేందుకు కల్వర్టు నిర్మించారు. ఈ కల్వర్టు శిథిలం కావడంతో ఈ రోడ్డులో ప్రయాణించే వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు స్పందించి శిథిలమైన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

తురాయిపూల సోయగం



బీఎన్ రోడ్డులో ఎర్రపూల సోయగం



బుచ్చెయ్యపేట రోడ్డు పక్కన పొలాల్లో కనువిందుగా పసుపు పూలు

మండు వేసవిలో రోడ్డు పక్కన పచ్చని పంట పొలాల్లో తురాయి చెట్లు కనువిందు చేస్తున్నాయి. పసుపు, ఎరుపు, కాషాయ రంగులో విరబూసిన పూలు చూపరులకు కనువిందు చేస్తున్నాయి. ఆకులు లేకుండా చెట్టంతా విరబూసిన పుష్ప సౌందర్యాన్ని ప్రకృతి ప్రేమికులు తనివితీరా ఆస్వాదిస్తున్నారు. – బుచ్చెయ్యపేట

దేవరాపల్లిలో గౌతమి బుద్ధుని జయంతి నేడు

దేవరాపల్లి : దేవరాపల్లిలోని రైవాడ అతిథి గృహంలో గౌతమ బుద్ధుని జయంతి (బుద్ధ పూర్ణిమ) కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించనున్నట్టు మండల అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు తెలిపారు. మండల అంబేడ్కర్ ఆశయ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుని చిత్రపటం పూల అలంకరణ కార్యక్రమాన్ని చేపడతామన్నారు.

వేసవిలో బొప్పాయి సాగుతో అధిక లాభాలు

- జిల్లాలో 300 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో సాగు
- యాజమాన్యంపై కేవీకే శాస్త్రవేత్త సూచనలు



బుచ్చెయ్యపేటలో సాగవుతున్న బొప్పాయితోట



ఏపుగా ఎదిగిన కాయలు

బుచ్చెయ్యపేట : బొప్పాయి పంట వేసవి కాలంలో సాగుకు అనుకూలంగా ఉంటుందని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) శాస్త్రవేత్త కె.సత్తిబాబు తెలిపారు. వర్షాకాలం కంటే వేసవి కాలం ముందు బొప్పాయి సాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రస్తుత వాతావరణంలో మార్పులు అధిక ఎండలు, ఉష్ణోగ్రత, అకాల వర్షాలకు రైతులు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. ప్రస్తుతం మార్కెట్లో కూడా బొప్పాయికి మంచి ధర ఉందన్నారు. బొప్పాయి సాగులో సరైన యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ చర్యలు చేబడితే అధిక పంట దిగుబడులు సాధించ వచ్చన్నారు. జిల్లాలో బుచ్చెయ్యపేట, సబ్బవరం, దేవరాపల్లి, రావికమతం, చీడికాడ, కోటపాడు, పెందుర్తి తదితర మండలాల్లో సుమారు మూడు వందల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో రైతులు బొప్పాయి తోటలు సాగు చేస్తున్నారు. నీరు చేరని మెట్ట ప్రాంతాల భూములు బొప్పాయి సాగుకి అనుకూలిస్తాయి. బొప్పాయి తోటలో నీరు చేరకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కువ నీరు చేరితే బైటకు నీరు పోయేలా చేయాలి. తక్కువ నీటితో పండే పంట కాబట్టి ఎండాకాలంలో ఎక్కువగా డ్రిప్ పద్ధతుల్లో బొప్పాయి తోటలకు నీరందిస్తే సాగుకు అనుకూలంగా ఉంటుంది.

తెగుళ్ల నివారణ ఇలా...

బొప్పాయికి తెగుళ్ల బెడద ఎక్కువగా ఆశిస్తుంది. ఎప్పటికప్పుడు రైతులు పంట ఎదుగుదలపై దృష్టి సారించి తెగుళ్ల నివారణ చర్యలు చేపడితే అధిక పంట దిగుబడులు సాధించ వచ్చన్నారు. కాండం మొదలు కాండం కుళ్లు తెగులు బొప్పాయిలో ఎక్కువగా కాండం మొదలు, కాండం కుళ్లు తెగులు వస్తుంది. నర్సరీలో మొక్కలు పెంచుతున్నపుడు వస్తుంది. వేర్ల మొదళ్లు మొత్తగా మారిపోయి కుళ్లిపోతాయి. కాయలున్న చెట్లకు ఎక్కువగా నష్టం జరుగుతుంది. దీని నివారణకు మొక్క మొదట్లో నీరు నిల్వ లేకుండా చేయాలి. బోర్డో మిశ్రమం ఒక శాతం లేదా అలియేట్ 2 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి మొదళ్లు తడిచేలా పిచికారి చేయాలి. లేదా 10 గ్రాముల ట్రైకోడెర్మా పొడిని లీటరు నీటిలో కలిపి బొప్పాయి మొక్కల మొదలు చుట్టూ నేల బాగా తడిచేలా పోయాలి. లేదా కిలో ట్రైకోడెర్మా విరిడి శిలీంద్రాన్ని,90 కిలోల పశువుల గెత్తాన్ని,10 కిలోల వేపపిండి, కిలో బెల్లం నీటిలో పది రోజులు మాగనిచ్చి చెట్టు మొదట్లో వేయాలి. కాండం మొదట్లో కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. లేదా మెజాయిన్ మందును లీటరు నీటికి రెండు గ్రాములు కలిపి పిచికారి చేయాలి.

బొప్పాయి రింగ్ స్పాట్ వైరస్

ఈ తెగులు బొప్పాయిలో ఆశించినపుడు ఆకులు పరిమాణం తగ్గి సన్నటి తీగలాగ మారిపోతాయి. కాయలు మరియు కాండం మీద ఉంగరం లాంటి మచ్చలు కనిపిస్తాయి. ఈ వైరస్ తెగులు సోకిన కాయలు నిల్వ సామర్థ్యం తగ్గిపోతుంది. పొలం చుట్టూ రెండు వరసలు మొక్కజొన్నను అడ్డు పంటగా సాగు చేయాలి. బొప్పాయి మొక్కలను నాటే నెల రోజుల ముందు మొక్కజొన్న పంటను ముందుగా సాగు చేయాలి. ఈ తెగులు నివారణకు అంతర్వాహిక క్రిమి సంహారక మందులైన 2 మిల్లీలీటర్లు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమాటాన్ లేదా ఫిప్రోనిల్ మందును లీటరు నీటిలో కలిపి నెలకు ఒకసారి చొప్పున ఐదు నెలలు పాటు పిచికారి చేయాలి. దీనివల్ల వైరస్ తగ్గుముఖం పడుతుంది.

ఆకు ముడత తెగులు

ఆకుముడత తెగులు వైరస్ వల్ల వస్తుంది. ఈ వైరస్ ఆశించిన మొక్కల్లో ఆకులు ముడుచుకు పోతాయి. తెగులు తీవ్ర మైనపుడు ఆకులు ఉండలుగా మారిపోయి వికృత రూపం దాల్చుతాయి. కాయలు కూడా సహజ ఆకారాన్ని కోల్పోయి వంకరటింకరగా తయారవుతాయి. పంట దిగుబడి బాగా తగ్గిపోతుంది. అంతర్వాహిక కీటక నాశిని ఉపయోగించి రసం పీల్చు పురుగులను నియంత్రిస్తే వైరస్‌ని అరికట్టవచ్చు. పక్వానికి వచ్చిన కాయలను సకాలంలో కోసి మార్కెట్ చేసుకోవడం ద్వారా రైతులు లాభాలు పొందుతారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లికి వందనం



కె.కోటపాడు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో తల్లులకు పాదపూజ

కె.కోటపాడు : తల్లులే బిడ్డలకు మొదటి గురువు అని కె.కోటపాడు అంగన్‌వాడీ కార్యకర్తలు డోకల కుమారి, భూపతి లక్ష్మి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో గల విద్యార్థులతో వారి తల్లులకు ఆదివారం పాదపూజ నిర్వహించే కార్యక్రమాన్ని చేపట్టారు. తల్లులకు చిన్నారులు కాళ్లు కడిగి, పూలు చల్లి ఆశీర్వాదాలు తీసుకున్నారు.